

స్ఫూర్తినీయం అల్లూరి జీవితం

కలెక్టర్ టిఎస్.చేతన్ - అల్లూరికి పలువురి నివాళి



అల్లూరి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

స్వాతంత్ర్య పోరాటంలో చిన్నతనంలోనే బ్రిటీష్ పాలకులను ఎదురించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జీవితం నేటి యువతకు స్ఫూర్తినీయంగా నిలుస్తుందని కలెక్టర్ టిఎస్.చేతన్ తెలియజేశారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అల్లూరి సీతారామరాజు 128వ జయంతి మహోత్సవం నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జీవితం ప్రతి భారతీయుడికి గర్వకారణమని తెలిపారు. స్వాతంత్ర పోరాటంలో ఆయన చూపిన తెగువ నేటి యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. మన్యం ప్రాంతంలోని గిరిజనుల బాధలను దగ్గరగా గమనించి, తెల్లదొరల దమన రాజకీయానికి వ్యతిరేకంగా గళమెత్తిన పోరాట వీరుడని గుర్తు చేశారు. భారత స్వాతంత్ర్య చరిత్రలో అల్లూరి సీతారామరాజు మహోజ్వల శక్తి అన్నారు. సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్రం వస్తుందని నమ్మి, దాని కోసం తన ప్రాణాలర్పించిన యోధుడు అన్నారు. ఆయన త్యాగం భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో ఒక చిరస్మరణీయ ఘట్టంగా నిలిచిపోయిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విజయసారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సూర్య నారాయణ రెడ్డి, రామసుబ్బయ్య, కలెక్టరేట్ ఏవో వెంకట నారాయణ, పర్యాటక శాఖ మేనేజర్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

బోధించే వారేరి..?



- చరిత్ర ఘనం... చచ్చుబడిన బోధన..!
- శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో అధ్యాపకుల కరువు
- 16 శాతం మందే బోధకులు
- ఎనిమిది విభాగాల్లో పూర్తిగా ఖాళీ

అనంతపురం జిల్లాలో విద్యాభివృద్ధిలో భాగంగా శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. దేశ వ్యాప్తంగా ఈ యూనివర్సిటీకి ఘనమైన చరిత్ర ఉంది. ఇందులో చదువుకున్న వారెందరో దేశ విదేశాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారు. ఇదంతా గతం.. ఇప్పుడు యూనివర్సిటీ పరిస్థితే మారిపోయింది. విద్యార్థులకు బోధించే అధ్యాపకులు లేక చాలా విభాగాలు ఖాళీగా ఉన్నాయి. అధ్యాపకుల్లేక క్రమక్రమంగా విద్యాబోధన చచ్చుబడిపోతోంది. ఏళ్ల తరబడి తాత్కాలిక బోధకులతోనే నెట్టుకొచ్చే పరిస్థితులు నెలకొన్నాయి. ఇదే పరిస్థితి మరికొంత కాలం కొనసాగితే ఉన్నత విద్య అటకెక్కే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తుండటం విచారకరం.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి ఘనమైన చరిత్ర ఉంది. అనేక మంది రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు ఇక్కడ చదువుకున్న వారే ఉన్నారు. 1967లో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం అనుబంధంగా పోస్టు గ్రాడ్యుయేషన్ కేంద్రంగా ఏర్పాటైంది. 1976 నాటికి అది అటానమస్ కాలేజీగా ఏర్పాటైంది. ఆ తరువాత 1981లో యూనిటరీ యూనివర్శిటీగా ఏర్పాటైంది. 1988 నుంచి పూర్తి స్థాయి విశ్వవిద్యాలయంగా మారింది. అప్పటి నుంచి అంచెలంచెలుగా విశ్వవిద్యాలయం విస్తరణ సాగుతూనే వచ్చింది. ప్రస్తుతం దీని పరిధిలో 13 ఆర్ట్స్ డిపార్టుమెంట్లు ఉండగా, 16 సైన్స్ డిపార్టుమెంట్లు ఉన్నాయి.

16 శాతమే అధ్యాపకులు

సుదీర్ఘమైన చరిత్ర కలిగిన శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉంది. సాధారణంగా అయితే ప్రతి డిపార్టుమెంట్‌కు ఒక ప్రొఫెసర్, ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండాలి. ప్రతి డిపార్టుమెంట్‌కు ఏడుగురుకు సిబ్బంది ఉండాలి. ఈ ప్రకారం 29 డిపార్టుమెంట్లకు కలిపి 203 మంది ఉండాలి. ప్రస్తుతం శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో మొత్తం కలిపి 33 మంది మాత్రమే ఉన్నారు. అంటే 16 శాతంలోపే బోధనా సిబ్బంది యూనివర్సిటీలో ఉన్నారు.

ఎనిమిది డిపార్టుమెంట్‌ల్లో ఒక్కరూ లేరు..!

విశ్వవిద్యాలయం పరిధిలో మొత్తం 29 డిపార్టుమెంట్‌లు ఉంటే అందులో ఎనిమిది డిపార్టుమెంట్లకు ఒక్కరు కూడా బోధనా సిబ్బంది లేకపోవడం గమనార్హం. సోషియాలజీ, హిస్టరీ, పాలిమర్ సైన్స్, జువాలజీ, ఎంఇడి, హిందీ, మైక్రో బయాలజీ, సెరికల్చర్ విభాగాలకు అధ్యాపకులు ఒక్కరూ లేరు. 13 డిపార్టుమెంట్లకు ఒకరు చొప్పున ఉన్నారు. తొమ్మిది డిపార్టుమెంట్లకు ఇద్దరు నుంచి ముగ్గురున్నారు. మొత్తంగా 203 మంది ఉండాల్సిన చోట కేవలం 33 మంది మాత్రమే ఉన్నారు.



తాత్కాలిక సిబ్బందే దిక్కు

యూనివర్సిటీలో బోధనా సిబ్బంది పెద్దఎత్తున ఖాళీలుండగా ఆ స్థానాల్లో తాత్కాలిక సిబ్బందితో నెట్టుకొస్తున్నారు. ఉన్నతమైన విద్యను బోధించే తాత్కాలిక సిబ్బంది కూడా సరైన వేతనం లేదు. అకడమిక్ కన్సల్‌టెన్సీల పేరుతో గంటకు రూ.500 చొప్పున వేతనమిచ్చి తరగతులను కొనసాగిస్తున్నారు. అనేక సంవత్సరాలుగా విశ్వవిద్యాలయాల్లోని అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయకపోవడంతోనే ఇంత పెద్దఎత్తున ఖాళీలు ఏర్పడ్డాయని విద్యావేత్తలు చెబుతున్నారు. వీటిని భర్తీ చేస్తామని గత వైసిపి ప్రభుత్వం గొప్పగా ప్రకటించింది. తర్వాత న్యాయస్థానం చిక్కులు చూపించి భర్తీ చేయలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా అదే తీరులో నడుస్తుండటం గమనార్హం.

పిహెచ్‌డి చేయాలన్నా కష్టమే

బోధనా సిబ్బందిని నియమించకుండా ఇదే పరిస్థితి కొనసాగితే ఎస్‌కెయులో పిహెచ్‌డి పట్టా పొందాలన్నా రాబోయే రోజుల్లో గగనమయ్యే పరిస్థితులు నెలకొననున్నాయి. పిహెచ్‌డి పొందాలంటే ప్రొఫెసర్లు గైడ్ చేయాల్సి ఉంటుంది. యూనివర్సిటీలో ప్రొఫెసర్లే లేకపోవడంతో విద్యార్థులు ఎవరి ఆధ్వర్యంలో పూర్తి చేయాలన్న సమస్య వచ్చే అవకాశముంది. గతేడాది ఉర్దూకు ఇదే రకమైన సమస్య రావడంతో దానికి సంబంధించి పిహెచ్‌డి నోటిఫికేషన్ లేకుండానే రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కూటమి ప్రభుత్వం స్పందించి ఎస్‌కె యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న అన్ని అధ్యాపక పోస్టులను భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, మేధావులు కోరుతున్నారు.

కెజిబివి విద్యార్థినులకు అస్వస్థత

◆ పాపిరెడ్డిపల్లి కెజిబివిలో ఘటన



అస్వస్థతకు గురైన పాపిరెడ్డిపల్లి కెజిబివి విద్యార్థినులు

శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి మండల పరిధిలోని పాపరెడ్డిపల్లి కస్తూరిభా గాంధీ బాలిక పాఠశాలలో ఫుడ్‌పాయిజన్‌తో విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. గురువారం రాత్రి అన్నం, సాంబారు, రసం తిన్న అనంతరం విద్యార్థినులు వాంతులు విరోచనాలకు గురయ్యారు. స్పందించిన పాఠశాల సిబ్బంది వారికి వైద్య చికిత్సలు అందించే ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వీరందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. విద్యార్థినుల అస్వస్థత విషయం తెలుసుకున్న రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత పాఠశాలకు వెళ్లి విద్యార్థినులను పరామర్శించారు. అందరికీ మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినులను పరామర్శించేందుకు వెళ్లిన సమయంలో పాఠశాల వద్ద టిడిపి, వైసిపి నాయకుల మధ్య ఘర్షణ నెలకొంది.

వార్త మెయిన్‌లో

కంది విత్తనాలను సద్వినియోగం చేసుకోండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న కంది విత్తనాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. రామగిరి మండలంలోని నసనకోట గ్రామంలో శుక్రవారం రైతులకు కంది విత్తనం పంపిణీ చేశారు. ఆ గ్రామ పరిధిలోని రైతులకు ఎల్‌ఆర్‌జి-52, 105 రకం విత్తనం కందులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు వేరుశనగతో పాటు కందిని అంతర పంటగా వేసుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కొన్ని చోట్ల కంది మాత్రమే వేసుకుంటు న్నారన్నారు. వేరుశనగతో పాటు కచ్చితంగా అంతర పంటగా మరో రకం పంట వేసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే కంది విత్తనాన్ని ఎవరూ బయట విక్రయించకూడదన్నారు. వ్యవసాయశాఖ అధికారులు రైతులకు ఎప్పటికప్పుడు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, టిడిపి నాయకులు, రైతులు పాల్గొన్నారు.



కంది విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సునీత

పశువులను రోడ్లపై వదలొద్దు : కమిషనర్

ప్రజాశక్తి-పెనుకొండ

పశువుల పెంపకందారులు పశువులను రోడ్లపై వదిలి ప్రమాదాలకు కారణం అవుతున్నారని, ఇకపై పశువులను రోడ్లపైకి వదిలితే కఠిన చర్యలు తీసుకుంటామని నగర పంచాయతీ కమిషనర్ సతీష్‌కుమార్ హెచ్చరించారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో పలు ప్రాంతాలతో పాటు ప్రధాన రహదారుల్లో ఇరువైపులా పశువులు నిత్యం సంచరించటం వల్ల ప్రజలు, వాహనదారులు ప్రమాదాలకు గురవడంతో పాటు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విష యంపై ప్రజలు, పాదచారులు, ప్రజా ప్రతినిధుల నుంచి ఫిర్యాదులు అందాయన్నారు. ఈ విషయంపై ఇది వరుకే పశువుల పెంపకందారులకు నోటీసులు ఇచ్చామని, అయినా వారిలో మార్పు రాలేదన్నారు. పశువులను రోడ్లపై వదలకుండా వారి సొంత స్థలాల్లో కట్టేసుకోవాలని సూచించారు. ప్రజల ఆరోగ్యం, భద్రత దృష్ట్యా నగర పంచాయతీ పరిధిలో రోడ్లపై పశువులు సంచరిస్తే గోశాలకు తరలిస్తామని హెచ్చరించారు. అలాగే పశువుల పెంపకందారులపై చట్టరీత్యా చర్యలు తీసుకొని జరిమానా విధిస్తామన్నారు. అలాగే పట్టణంలో పలు ప్రాంతాల్లో మురికి నీటిని రోడ్లపై వదులుతున్నారని, అలా కాకుండా డ్రెయినేజీ కాలువలు, గుంతల్లోకి వదలాలన్నారు. అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



కమిషనర్ సతీష్‌కుమార్

కౌలు రైతు కార్డుకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-మడకశిర

మండలంలోని కౌలు రైతులు వారి గ్రామ రెవెన్యూ అధికారిని కానీ రైతు సేవా కేంద్రం సిబ్బందిని కానీ కలిసి కౌలు రైతు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి తిమ్మప్ప శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కౌలు రైతు కార్డుకు 11 నెలల కాల పరిమితి ఉంటుందన్నారు. భూ యజమాని ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం లేదా 1-బి, ఫొటో, కౌలు రైతు ఆధార కార్డు, ఫొటో తీసుకెళ్లి స్థానిక వీఆర్వో, విఎఎలను సంప్రదించాలన్నారు. కౌలు రైతు కార్డు కలిగిన వారు పంట నమోదు చేసుకుంటే అన్నదాత సుఖీభవ, పంట నష్ట పరిహారం, తదితర పథకాలు వర్తిస్తాయన్నారు. బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తారని, సున్నా వడ్డీ పథకం కూడా వర్తిస్తుందన్నారు.

గర్భిణులకు భోజన సదుపాయం

ప్రజాశక్తి-లేపాక్షి

స్థానిక పిహెచ్‌సిలో ప్రతి వారం నిర్వహించే పరీక్షలకు హాజరైన గర్భిణులకు శుక్రవారం రమామణి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ అధినేత, సమాజ సేవకులు, లేపాక్షి ఆలయ కమిటీ ఛైర్మన్ కరణం రమానందన్ భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. సుమారు 65 మంది మహిళలకు ఉచితంగా పౌష్టికాహారం అందజేశారు. తన తల్లి పేరు మీద గర్భిణులకు భోజనం అందజేయడం నా అదృష్టం అని రమానందన్ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు, సిబ్బంది, గర్భిణులు, రమానందన్ మిత్రమండలి పాల్గొన్నారు.

కొంకల్లులో వైద్య శిబిరం

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని కొంకల్లు గ్రామంలో ఇటీవల ఓ వృద్ధుడు డెంగీ లక్షణాలతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎంపిడిఒ కేశవరెడ్డి శుక్రవారం వైద్య సిబ్బందితో కలిసి ఆ గ్రామం వెళ్లి వైద్య శిబిరం ఏర్పాటు చేయించారు. అలాగే గ్రామంలో పారిశుధ్య పనులు చేయించారు. తాగునీటి కొళాయిల చుట్టూ శుభ్రం చేయించారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక ఉర్దూ, ప్రాథమిక మెయిన్ పాఠశాలల నుంచి ఉద్యోగోన్నతి, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఎస్‌జిటిగా పనిచేస్తున్న జవాజి నాగరాజుకు స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి రావడంతో ఆయన చాలకూరు పాఠశాలకు బదిలీ అయ్యారు. ఎం.శ్రీనివాసులు, ప్రభావతి, ఎం.తబసుమ్ ఉపాధ్యాయులు వేరే పాఠశాలకు బదిలీపై వెళ్లారు. దీంతో రెండు పాఠశాలల ఉపాధ్యాయులను ఆయా పాఠశాలల సిబ్బంది శాలువాలు, పూలమాలతో సన్మానించారు. వారి సేవలను కొనియాడారు.




బదిలీ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మత్స్యకారుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

గొల్లపల్లి రిజర్వాయర్‌లో 20 లక్షల చేప పిల్లలు వదిలిన మంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ

కూటమి ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందని మంత్రి సవిత తెలిపారు. మంత్రి శుక్రవారం మండలంలోని గొల్లపల్లి రిజర్వాయర్‌లో 20 లక్షల చేప పిల్లలను వదిలారు. మంత్రి మాట్లాడుతూ మత్స్యకారుల కుటుంబీకుల జీవనోపాధికి ప్రభుత్వం అండగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం జాలర్లను ఆదుకుంటోందన్నారు. గత వైసిపి ప్రభుత్వం మత్స్యకారులను నిర్లక్ష్యం చేసిందన్నారు. అనంతరం గొల్లపల్లి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజల అభిప్రాయాలు, వివిధ సంక్షేమ కార్యక్రమాలపై అడిగి తెలుసుకున్నారు. మంత్రి వెంట కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



రిజర్వాయర్‌లో చేప పిల్లలను వదులుతున్న మంత్రి సవిత

అల్లూరికి నివాళి

ప్రజాశక్తి-లేపాక్షి

అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయ ఆవరణలో తహశీల్దార్ సౌజన్య లక్ష్మి ఆధ్వర్యంలో అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తహశీల్దార్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు గొప్ప స్వాతంత్రోద్యమ విప్లవకారుడు అన్నారు. 27 ఏళ్ల వయసులోనే నిరక్షరాస్యులు, నిరుపేదలు, అమాయకులైన అనుచరులతో చాలా పరిమిత వనరులతో బ్రిటీష సామ్రాజ్యమనే మహాశక్తిని ఢీకొన్నారన్నారు. చివరకు దేశం కోసం ప్రాణాలర్పించారన్నారు. ఇలాంటి ఎంతో మంది స్వాతంత్ర్య ఉద్యమకారుల ద్వారానే మనం నేడు స్వతంత్ర స్వేచ్ఛా వాయువులు తీసుకోగలుగుతున్నాం అన్నారు. అలాంటి మహనీయులను స్మరించు కోవడం మనందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కుమార్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది వన్నూరప్ప, రమేష్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తహశీల్దార్

నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-మడకశిర

ఫైర్ సేఫ్టీ పరికరాలు, ఫైర్ అనుమతులు లేని ప్రయివేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేష్ మాట్లాడుతూ నియోజక వర్గంలోని మడకశిర, అమరాపురం, గుడిబండ, రొళ్ల ప్రాంతాల్లో పలు ప్రయివేట్ విద్యాసంస్థల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలు లేవని, సర్టిఫికెట్‌లు తీసుకోలేదని, మరి కొందరు రెన్యువల్ చేయకుండా విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే పెద్ద ఎత్తున నష్టం జరిగే ప్రమాదం ఉందని, వెంటనే ప్రయివేటు పాఠశాలలను తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కళ్యాణ్, షాహిద్, రాము, జబీ పాల్గొన్నారు.

పత్తి రైతులను ఆదుకోవాలి


ప్రజాశక్తి-మడకశిర

పత్తి రైతులను ఆదుకోవాలని కోరుతూ శుక్రవారం వైసిపి ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, తహశీల్దార్‌లకు వినతి పత్రాలు అందజేశారు. అనంతరం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 5 వేల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేస్తున్నారన్నారు. అయితే కంపెనీలు ఎకరాకు రెండు, రెండున్నర క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామని చెప్పడంతో రైతులు సుమారు రూ. 200 కోట్లు నష్టపోతారని, ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆనంద రంగారెడ్డి, రంగేగౌడ్, గంగాధర్ గౌడ్, శేషాద్రి, మల్లికార్జున గౌడ్, మనోహర్‌రెడ్డి, నాగభూషణ్‌రెడ్డి, ఎంపిటిసి నాగేంద్ర పాల్గొన్నారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేత

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని పెద్దగువ్వలపల్లి కొట్టాల గ్రామానికి చెందిన రైతు కమ్మ శ్రీరాములు కుమార్తె గుణవతి బి.టెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. విద్యార్థిని ఉన్నత చదువులకు అవసరం మేరకు మాజీ జడ్పీటీసీ, టిడిపి మండల నాయకులు చిన్నప్పయ్య శుక్రవారం రూ. 45 వేలు విలువ చేసే ల్యాప్ టాప్‌ను ఆయన స్వగృహంలో గుణవతికి అందజేశారు. దీంతో గుణవతి చిన్నప్పయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎల్.వెంకటరాముడు, అల్లు ఆంజనేయులు, రమేష్, హనుమంతు, సూర్య నారాయణ, అశ్వర్థ, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి ల్యాప్ టాప్ అందజేస్తున్న చిన్నప్పయ్య

ఆర్టీసీ కార్మికుల సమస్యలపై గేట్ మీటింగ్

ప్రజాశక్తి-పెనుకొండ

ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎపిఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డిపో వద్ద గేట్ మీటింగ్ నిర్వహిం చారు. రీజినల్ నాయకులు ఆర్‌ఎస్.రెడ్డి, సివిపి.పెద్దన్న, డిపో అధ్యక్షులు ఆంజనేయులు మాట్లాడుతూ ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగోన్నతులు ఇవ్వాలని, ఖాళీగా ఉన్న 10 వేల ఉద్యోగాలు భర్తీ చేయాలని, డిఎ బకాయిలు, 11వ పిఆర్సీ 24 నెలల బకాయిలు చెల్లించాలన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాట్యుటీ, టెర్మినల్ ఎన్‌క్యాష్‌మెంట్, ఎస్‌ఆర్బీఎస్, ఎస్బీటీ చెల్లింపు, డబల్ డ్యూటీలు చేసే సిబ్బందికి ఇచ్చే డిడి అమౌంట్‌ను పెంచాలని కోరారు. ఉద్యోగులు, కుటుంబ సభ్యులకు రెఫరల్ ఆసుపత్రుల ద్వారా పాత పద్ధతుల్లోనే వైద్య సౌకర్యాలు కల్పించాలన్నారు. సర్క్యులర్ 01/2019 యథావిధిగా అమలయ్యేలా స్పష్టమైన ఆదేశాలివ్వాలని కోరారు. సమావేశంలో గ్యారేజీ కార్యదర్శి సాయివంశీ, ప్రెసిడెంట్ విద్యాసాగర్, డిపో, గ్యారేజ్ ఉద్యోగులు పాల్గొన్నారు.



డిపో గేట్ వద్ద మాట్లాడుతున్న నాయకులు

బదిలీ ఉపాధ్యాయులకు వీడ్కోలు

ప్రజాశక్తి-రొద్దం

స్థానిక ఆదర్శ ప్రాథమిక పాఠశాల నుంచి ఆర్.మరువపల్లి పాఠశాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులు గిరీష్‌ను బి.నాగలక్ష్మి, ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా ఎంఇఒ జయభాస్కర్ హాజరై ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసి ఛైర్మన్ హరి, ఎంఆర్‌సి సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని కోగిర జడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం కిరణ్ అధ్యక్షతన బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచి రామకృష్ణ, ఎస్‌ఎంసి ఛైర్మన్ వశికేరప్ప, హెచ్‌ఎం వెంగప్ప బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు వెంకటేశులు, పోతులయ్య, శివయ్య, ఆదినారాయణ, పిడి శ్రీదేవిలను సన్మానించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, ఓబులేషు, పిడి మహేష్, ఉపాధ్యాయులు జాబిలి చాంద్‌బాషా, హసీనాబాను, రామాంజనేయులు, టిడిపి నేత అంజనేయులు, జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.



బదిలీ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

6న ప్రపంచ గ్రామీణాభివృద్ధి దినోత్సవం

గుడిబండ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రపంచ గ్రామీణాభివృద్ధి దినోత్సవంపై ఎంపిడిఒ కేశవరెడ్డి, తహశీల్దార్ శ్రీధర్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీ మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాల్లో ప్రపంచ గ్రామీణాభివృద్ధి దినోత్సవం ఘనంగా నిర్వహించాలన్నారు. అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని, అన్ని శాఖల అధికా రులు భాగస్వాములై విజయవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఐసిడిఎస్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ, సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు, ఇతర శాఖల ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలపై నిర్లక్ష్యం వద్దు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర

ప్రజల సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు అధికారులను ఆదేశించారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే రాజు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలిసి పట్టణంలోని 1, 3, 8 వార్డుల్లో పర్యటించారు. వారు ఇంటింటికీ వెళ్లి సుపరిపాలనకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందించి వాటి గురించి వివరించారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల స్పందన, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యల పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానిక టిడిపి నాయకులు కూడా ప్రజల సమస్యలను గుర్తించి వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చొరవ చూపాలని ఆదేశించారు. వారి వెంట రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

లేపాక్షి : మండలంలోని మానేపల్లిలో శుక్రవారం టిడిపి మండల అధ్యక్షులు వెంకటాపురం అభి ఆధ్వర్యం లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మానేపల్లి పంచాయతీలో రూ. 30 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, నీటి తొట్టెలు, కొండప్ప దేవస్థానం వద్ద రూ. 16 లక్షలతో కమ్యూనిటీ హాలు నిర్మించామన్నారు. బిసి కాలనీలో డ్రెయినేజీ, మానేపల్లి నుంచి గౌరిగానిపల్లి, కర్నాటక సరిహద్దు వరకూ వెంకటాపురం ప్రధాన రహదారి నిర్మిస్తామన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తెలపాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, ప్రకాష్‌రెడ్డి, గంగాధర్, కార్యకర్తలు పాల్గొన్నారు.



మడకశిరలో వికలాంగ విద్యార్థితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి
www.prajasakti.com

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఓబుళదేవరచెరువు

9వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మె ను జయప్రదం చేయాలని సిఐటియు మండల నాయకులు,వివి రమణ, సిఐటియు మండల కన్వీనర్ కుళ్లాయప్ప కోరారు. ఈ మేరకు సమ్మె నోటీసును, ఎంపీడీవో శివరాం ప్రసాద్ రెడ్డికి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కాంట్రాక్టర్ ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు అంజినప్ప, భాగ్యమ్మ, నిర్మల, నాగమ్మ, రమణమ్మ, లక్ష్మీ నరసమ్మ, సుగు నమ్మ, శ్రావణి, సాలెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మినీకిట్లు పంపిణీ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

మండల పరిధిలోని దర్శనమల గ్రామంలో వ్యవసాయ అధికారులు రైతులకి శుక్రవారం కందుల మినీకిట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ధర్మవరం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీ లక్ష్మానాయక్ మాట్లాడుతూ సబ్సిడీ విత్తనాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వ రాయితీలు వర్తిస్తుందన్నారు.కందుల మినీకిట్లను ప్రభుత్వము వందశాతం సబ్సిడీతో సరఫరా చేస్తోందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ముస్తఫా, ఎంపీఈవో రాజేశ్వరి , సెక్రటరీ మనోహర్ రెడ్డి, నాయకులు చంద్ర, ధనుంజయ, నరేష్, చెన్నకేశవులు గ్రామ రైతులు పాల్గొన్నారు.

స్కూల్‌బ్యాగులు పంపిణీ

ప్రజాశక్తి - కదిరి టౌన్

స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్కూల్‌బ్యాగులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా హెచ్ఎం వెంకటాచలం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి - కదిరి టౌన్

మండల పరిధిలోని సోమేశ్ నగర్‌లో శుక్రవారం చేపట్టిన పారిశుధ్య పనులను ఎంపిడిఒ పోలప్ప పరిశీలించారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేయాలని సూచించారు. తప్పనిసరిగా ప్రజలందరూ చెత్తని రోడ్డు మీద వేయకుండా గ్రీన్ అంబాసిటర్ వారికి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యాబోధన

ప్రజాశక్తి - పరిగి

విద్యార్థులకు అందించే విద్యాబోధన ఉన్నత విలువలతో ఉండాలని పరీక్షల విభాగపు అసిస్టెంట్ కమిషనర్ లాజర్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల సందర్శించిన ఆమె విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ గూర్చి అవసరమైన వారికి తెలియచేయాలని, అందరూ ఈ సదవకాశాన్ని ఉపయోగించుకునే విధంగా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు లక్ష్మీదేవి, శేషాచలం తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

ఇఎస్.వెంకటేష్


సమావేశంలో మాట్లాడుతున్న ఇఎస్. వెంకటేష్

ప్రజాశక్తి - బుక్కపట్నం

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను, ఉద్యోగులను పర్మినెంట్ చేసి రాష్ట్రమంతా ఒకే వేతనం అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పంచాయితీ కార్మికులకు గత 8 సంవత్సరాలుగా వేతనాలు పెంచలేదన్నారు. మున్సిపల్ కార్మికులు నిర్వహిస్తున్న విధులనే పంచాయితీ కార్మికులు నిర్వహిస్తున్నప్పటికీ పంచాయితీ కార్మికులకు రూ. 4 వేల నుండి 14 వేల రూపాయల లోపు వేతనాలు ఇస్తున్నారన్నారు. మున్సిపల్ కార్మికులతో పాటు, పంచాయతీ కార్మికులు కూడా 21 వేల రూపాయల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కనీసవేతనాలు, గుర్తింపుకార్డులు, పిఎఫ్, ఇఎస్ఐ, దహన సంస్కారాలకు ఆర్థికసాయం తదితర వాటికి సంబంధించి జీవోలు నేటికి అమలుకాలేదన్నారు. 2015, 2023 లో హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలుచేసి కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్‌కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేస్త్రి ఆదినారాయణ, పంచాయతీ కార్మికులు సుబ్బరాయుడు, నరసింహులు,పెద్దన్న,నరసింహప్ప, రమేష్ గంగాధర్, ఓబులమ్మ, రత్నమ్మ, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

జనాభా విద్యపై పాఠశాల, జిల్లా స్థాయి పోటీలు

ప్రజాశక్తి - బుక్కపట్నం

ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ప్రభుత్వ జిల్లా పరిషత్, కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు ఈనెల ఏడవ తేదీన చిత్రలేఖనము, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, విద్యాశాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. జనాభా విద్యపై విద్యార్థులకు అవగాహన పెంపొందించడం కోసం పొగాకు, మత్తు పదార్థాల దుర్వినియోగం, నివారణ, లింగ సమానత్వం, గౌరవం అనే విభాగాలపై ఈ నెల ఏడవ తేదీన ఉమ్మడి జిల్లాలోని జిల్లా పరిషత్, కేజీబీవీ పాఠశాలలో పోటీలు నిర్వహించాలని తెలిపారు. పాఠశాల స్థాయిలో మొదటి, ద్వితీయ బహుమతి పొందిన విద్యార్థులకు ఈనెల 9వ తేదీన బుక్కపట్నంలోని ప్రభుత్వ డైట్ కళాశాల నందు జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘంలో పొరుగు సేవల కింద పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన దీక్షలు శుక్రవారం నాటికి 11వ రోజులకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా హిందూపురం సిఐటియు పట్టణ కార్యదర్శి రాము కార్మికులకు మద్దతుగా పాల్గొని మాట్లాడారు. పాలకపక్షం, మున్సిపల్ అధికారులు కార్మికులు నిరసనకు దిగి 11 రోజులు గడిచినప్పటికీ కార్మిక సమస్యల్ని ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే నిరసనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు మల్లికార్జున, సహాయ కార్యదర్శి రామచంద్ర, నాయకులు చంద్ర, బాబయ్య, శంకర, మూర్తి, మహిళ నాయకులు గంగ రత్నమ్మ, కవిత, సుబ్బలమ్మ, నాగమణి, మహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాయితీ సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుతో ఉపయోగాలు

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

ప్రజాశక్తి - కదిరి అర్బన్

ప్రతి ఒక్కరూ సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకొని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకొని, ఆర్థికంగా బలపడదామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రజలకు పిలుపునిచ్చారు. జిల్లా విద్యుత్ శాఖ అధికారి సంపత్ కుమార్ అధ్యక్షతన పట్టణ పరిధిలోని దత్త కల్యాణ మండపంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సోలార్ రూఫ్‌టాప్ నెట్ మీటర్ ఇన్ అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సోలార్‌రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారుజ సోలార్ రూట్ ఆఫ్ నెట్ మీటరింగ్ వల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయన్నారు. నివాసాలకు హాస్పిటల్ పాఠశాలలు పెద్దపెద్ద గృహాలకు లేక ఖాళీగా ఉన్న స్థలంలో సోలార్ ప్లేట్లు అమర్చుకొని వాటి ద్వారా విద్యుత్తుని ఉత్పత్తి చేసుకోవచ్చన్నారు. ఉత్పత్తి చేసుకున్న విద్యుత్‌ను తమ అవసరాలకు వాడుకొని మిగిలిన విద్యుత్తును విద్యుత్ శాఖ వారికి విక్రయించవచ్చని చెప్పారు. నెలవారి బిల్లు రూ. 1500 నుండి 2వేల రూపాయల వరకు పొదుపు అవుతుందన్నారు. కదిరి మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్ శాఖ కార్యాలయం, ఆర్డీవో, మున్సిపాలిటీ, పోలీస్ స్టేషన్ తదితర ప్రభుత్వ శాఖల కార్యాలయంలో సోలార్ రూఫ్‌టాప్‌లను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అధికారులకు ఆదేశించారు. వాటి వల్ల వినియోగదారులకు అవగాహన పెరిగి రాయితీ సోలార్ రూఫ్‌టాప్‌పై మొగ్గు చూపుతారని ఎమ్మెల్యే వారికి వివరించారు. కూటమి ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీ సోలార్ రూఫ్‌టాప్‌లను వినియోగించుకుంటున్న వినియోగదారులు హోటల్ శ్రీనివాసులు, తమ్మిశెట్టి రమేష్ తదితరులను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ జిల్లా విద్యుత్ శాఖ అధికారి సంపత్ కుమార్ సత్కరించారు.

మోసం చేసిన వ్యాపారిపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువుకు చెందిన వ్యాపారి దాల్మిల్ సూరి తమతో సరుకు తీసుకొని డబ్బులు చెల్లించలేదని అతనిపైన చర్యలు తీసుకోవాలని తాడిపత్రికి చెందిన రైతులు కోరారు. ఈసందర్భంగా వారు శుక్రవారం స్థానిక నాలుగు రోడ్ల కూడలి నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా రైతు సుధాకర్ రెడ్డితో పాటు మరికొంతమంది రైతులు మాట్లాడుతూ కంది, పప్పుశనగను తమ వద్ద నుండి కొత్తచెరువుకు చెందిన వ్యాపారి దాల్‌మిల్ సూరి కొనుగోలు చేసి ఇంతవరకు డబ్బులు చెల్లించలేదన్నారు. రైతులందరికి రూ.1.30 కోట్ల రూపాయలు బాకీ ఉన్నారన్నారు. ఈ మొత్తానికి సంబందించి గతంలో తమకు చెక్కులు ఇచ్చాడని అవి చెల్లలేదని వాపోయారు. ఆందోళన చేస్తున్న విషయం తెలుసున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని రైతులకు మాట్లాడారు. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని వారికి సూచించారు. దీంతో రైతులు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.


తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు


విద్యార్థులతో వైద్యులు, పాఠశాల డైరెక్టర్ ప్రజీత్ రెడ్డి

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-హిందూపురం

పౌష్టిక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తోందని ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు కేశవులు, రామచంద్ర రావు అన్నారు. శుక్రవారం పట్టణ సమీపంలోని ఇందిరమ్మ కాలనీలో ఉన్న లోటస్ పబ్లిక్ స్కూల్ పాఠశాలలో ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ శ్రీ సత్యసాయి జిల్లా విభాగం అధ్యక్షులు డాక్టర్ కేశవులు అధ్యక్షతన చిన్న పిల్లల వైద్యులచే విద్యార్థులకు ఆరోగ్యంపై వారి స్థాయికి తగిన విధంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా చిన్న పిల్లల వైద్యుల సమాఖ్య జిల్లా అధ్యక్షులు డాక్టర్ కేశవులు, ఉపాధ్యక్షులు డాక్టర్ .రామచంద్ర రావు మాట్లాడుతు మారుతున్న సమాజంలో ఆహారపు అలవాట్లలో చాలా మార్పులు వస్తున్నాయన్నారు. అసహజ రుచికరమైన ఆహారానికి (జంక్ ఫుడ్‌కు)దగ్గరవుతూ జీవిస్తున్నామన్నారు. రంగు రంగుల పాకెట్లకు ఆకర్షితులై వాటికి అలవాటు పడి అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. దీంతో చిన్న వయస్సులోనే వచ్చే జబ్బులు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ప్రజీత్ రెడ్డి, ప్రిన్సిపల్ సూర్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి-బుక్కపట్నం

స్కూలుకు వెళ్లలేదని తల్లి మందలించడంతో క్షణికావేశంలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి హేమంత్ కుమార్ నాయక్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని చిన్న చెరువు తండాలో చోటుచేసుకుంది. ఎస్ఐ కృష్ణమూర్తి, విద్యార్థి తల్లి సంకు బాయి తెలిపిన వివరాల మేరకు హేమంత్ కుమార్ నాయక్ మారాలలోని జడ్పీ హైస్కూల్ నందు 9వ తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో గురువారం స్కూలుకు వెళ్లకుండా అల్లరిగా తిరుగుతుండగా తల్లి మందలించింది. దీంతో హేమంత్‌కుమార్ క్షణికావేశానికి లోనై ఇంటిలోనే బాత్రూంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన తల్లి 108 ద్వారా బత్తలపల్లి ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం మత్తులో ఘర్షణ.. వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని వానవోలుతండా పంచాయతీ పరిధిలోని ముత్తరాయునితండా గ్రామంలో శుక్రవారం సాయంత్రం భాస్కర్‌నాయక్ అనే వ్యక్తి మద్యం మత్తులో మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఇదే తండాకు చెందిన లోకేష్ నాయక్ ఇది మంచి పద్ధతి కాదని సర్ది చెప్పే ప్రయత్నం చేశాడు. దీంతో భాస్కర్‌నాయక్ ఉన్నఫళంగా ఓ పెద్ద కర్ర తీసుకొని లోకేష్‌నాయక్‌పై దాడి చేయడంతో తలకు తీవ్రంగా గాయం కావడంతో లోకేష్‌నాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు సిఐ శేఖర్ తెలిపారు.

పేకాట జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండల కేంద్రంలో పేకాట ఆడుతున్నారన్న 11 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ. 1,01,050లు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రంలోని మారుతి నగర్ లో జొన్నలగడ్డ రంగ నాయుడు ఇంటి పక్కన ఉన్న రంగా నాయుడు కు చెందిన రేకుల షెడ్డులో జూదం ఆడుతున్నారని సమాచారం మేరకు ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ. 1,01.050ల నగదుతో పాటు నాలుగు మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులనుకోర్టు ముందు హాజరు పరుస్తామన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాటం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పెద్ద ఎత్తున పోరాడుతామని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు నాగార్జున రెడ్డి , డిపో కార్యదర్శి ముస్తఫా తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 18 డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని, లేని పక్షంలో దశలవారీగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ జాయింట్ కార్యదర్శి నరసింహులు, ప్రచార కార్యదర్శి బుల్ల ఆదినారాయణ ,పెద్దక్క అరుణమ్మ, గ్యారేజ్ కార్యదర్శి మల్లికార్జున, సుధాకర్, బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ లక్ష్మన్న తో పాటు అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటాలు ఆగవని ఏపీ పి టి డి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నబి రసూల్ పేర్కొన్నారు. కదిరి ఆర్టీసీ డిపో ఆవరణంలో శుక్రవారం ఎంప్లాయిస్ యూనియన్ కదిరి డిపో కార్యదర్శి కొండారెడ్డి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నబి రసూల్, ఎంప్లాయిస్ యూనియన్ డిపో సీనియర్ నాయకులు పి. ఈ. ఖాన్, గ్యారేజ్ కార్యదర్శి అక్బర్, పురుషోత్తం, డిపో ప్రచార కార్యదర్శి కే హరికుమార్ పాల్గొన్నారు. .

హిందూపురం : ఆర్టీసీ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎంప్లాయిస్ యూనియన్ యూనియన్ అంకితభావంతో పనిచేస్తుందని ఆ యూనియన్ డిపో కార్యదర్శి మల్లికార్జున, రీజనల్ కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం డిపో, గ్యారేజ్ కార్మికులు డిపో ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రీజనల్ సహాయ కార్యదర్శి జీవీ లక్ష్మి, గ్యారేజీ అధ్యక్షులు ఎన్.ఏ. నారాయణ, డిపో నాయకులు రూపేంద్ర, శ్రీనివాసులు, అంజినప్ప, పోతిరెడ్డి, ఫక్రుద్దీన్, విగ్నేశ్వర, హనుమంత రెడ్డి, హెచ్ఎన్ మూర్తి, వెంకటేశులు, ఓంకార మూర్తి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యసాధన దిశగా యువత ముందుకెళ్లాలి

ప్రజాశక్తి-హిందూపురం

యువత లక్ష్యసాధన దిశగా చిత్తశుద్ధితో కష్టపడి పనిచేస్తే ఎంతటి కష్టతరమైన పనికూడా విజయవంతం అవుతుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి పేర్కొన్నారు. శుక్రవారం ఎన్. ఎస్.పి.ఆర్ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధిసంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన దాదాపు 15 ప్రైవేట్ కంపెనీలు హాజరై అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి, ఉద్యోగాల కోసం ఎంపిక చేసుకున్నాయి. ఈ జాబ్ మేళా కు 328 మంది హాజరువ్వగా 140 మంది యువతీ, యువకులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. . ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, నైపుణ్య అభివృద్ధి సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

ప్రజాశక్తి-పరిగి

మండలంలోని మోద పంచాయతీ చెక్ పోస్ట్ వద్ద ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుచేసేందుకు టిడిపి స్థానిక నాయకులు శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గోవింద్ రెడ్డి , మాజీ జెడ్పిటిసి సూర్యనారాయణ, సర్పంచి బాలాజీ, సోమప్ప, మొద శివ, నారాయణరెడ్డి, శాసనకోట వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల బలోపేతానికి నిర్దిష్ట విధానాలు అవసరం

జాతీయ సదస్సులో 'పురం' మున్సిపల్ ఛైర్మన్

ప్రజాశక్తి-హిందూపురం

స్థానిక సంస్థలు బలోపేతం కావడానికి నిర్దిష్టమైన విధివిధానాలను అవలంభించాల్సిన అవసరం ఉందని హిందూపురం మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్ సూచించారు. హర్యానా గుర్గావ్ లో రెండు రోజుల పాటు ఛైర్మన్లకు నిర్వహించే జాతీయ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చలు జరిపారు. ఇందులో భాగంగా మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ పలు సూచనలు చేశారు. స్థానిక సంస్థలు తక్కువ ఆదాయ వనరులు కలిగి ఉంటాయని, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అండగా నిలిచి, నిధులు కేటాయించడంతో పాటు స్థానిక సంస్థలను బలోపేతం కావడానికి పెద్ద చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యానికి ఇంజన్ లాంటివారని, ప్రభుత్వాలు అన్ని విధాలా సహకారం అందిస్తే స్థానిక సంస్థలు మరింత బలోపేతమై ప్రజలకు మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.



సదస్సులో మాట్లాడుతున్న 'పురం' ఛైర్మన్

'కూటమి'తోనే ప్రజాసంక్షేమం : ఎమ్మెల్యే


కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

ప్రజాసంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమనిని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర పేర్కొన్నారు. ఇంటింటికి కూటమి పాలనలో భాగంగా సంక్షేమ పథకాలు వివరించడానికి కొత్తచెరువు మండలం మారకుంటపల్లి, పోతులకుంట గ్రామాల్లో ఎమ్మెల్యేతో పాటు ఎంపీ బి.కె పార్థసారథి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి , జిల్లా తెలుగుదేశం అధ్యక్షుడు కల్లుకుంట అంజన్నప్ప పర్యటించారు. ఈ సందర్భంగా మరుకుంటపల్లి పంచాయతీలో ఇంటింటికి కూటమి ప్రభుత్వ పాలన గురించి ప్రజలకు వివరించారు. గ్రామంలో బీరప్ప స్వామి ఆలయం వద్ద రూ.10లక్షలతో కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. వడ్డెర సామాజిక వర్గానికి 80 లక్షలతో ఎంపీ లాండ్స్ ద్వారా ఒక కళ్యాణ మండపాన్ని ఓడి చెరువు ప్రాంతంలో ఏర్పాటు చేసినందుకు , బీరప్ప స్వామి గుడి సమీపంలో కురుబలకు కమ్యూనిటీ భవనం నిర్మాణానికి రూ 10 లక్షలు మంజూరు చెసిన ఎంపీ పార్థసారథిని మాజీమంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్లు రామకృష్ణ, వలిపి శ్రీనివాసులు టిడిపి సీనియర్ నాయకులు సాలెక్క గారి శ్రీనివాసులు, సామకోటి ఆదినారాయణ, సురేష్ ,సుధాకర్ , బండ్లపల్లి సర్పంచ్ రవి ,లోకేశ్ భాగ్య తదితరులు పాల్గొన్నారు.

తలుపుల : మండల పరిధిలోని బట్రేపల్లి గ్రామంలో ఇంటింటికి మన ఎమ్మెల్యే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఇంటింటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ముబారక్, నాయకులు మేడా శంకర్, బట్రేపల్లి మల్లికార్జున, రాము, కిట్ట, పార్థసారథి, సర్పంచి వెంకటనారాయణతో పాటు ఆయా శాఖల అధికారులు, సచివాల సిబ్బంది, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హిందూపురం : అభివృద్ధి, ప్రజా సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని టిడిపి నేతలు పేర్కొన్నారు. శుక్రవారం హిందూపురం రూరల్ మండలంలోని చలివెందుల పంచాయతీలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి శ్రీనివాసరావు, హిందూపురం రూరల్ మండలం అధ్యక్షులు హెచ్ఎన్ రాము, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ అశ్వర్థ నారాయణ రెడ్డి, రాష్ట్ర వాల్మీకి కార్పోరేషన్ డైరెక్టర్ బేవినహళ్లి ఆనంద్ కుమార్, మాజీ జడ్పీటీసీ ఆదినారాయణ, అరుణాచలరెడ్డి, ఐటీడీపి అధ్యక్షులు రామాంజినేయులు, క్లస్టర్ ఇంచార్జి ప్రదీప్, చిన్నారెడ్డి, శివ శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం బాలంపల్లి పంచాయతీకి చెందిన పలువురు టిడిపి నాయకులు శుక్రవారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో వైసీపీ నాయకులు వేణు రెడ్డి సమక్షంలో వైసీపీలోకి చేరారు. వీరందరికి వేణు రెడ్డి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వేణు రెడ్డి మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికి వెళ్లి వివరించాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో బలంపల్లి పంచాయతీకి చెందిన గుండప్ప గారి బాబన్న, గంగాధర్, నవనీత్ కుమార్, హరీష్, మద్దిలేటి, నవీన్ కుమార్ రెడ్డి, ఈశ్వర్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు మనోజ్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు సూర్య మోహన్, నాయకులు జంగాలపల్లి రవి, కొల్లకుంట వరుణ్ రెడ్డి, పట్టణ సెక్రెటరీ మనోజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో ఎవరూ చేరలేదు : టిడిపి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం బాలంపల్లి పంచాయితీకి చెందిన పలువురు టిడిపి నాయకులు వైసీపీలో చేరినట్లు వైసిపి నాయకులు ప్రచారం చేయడం అవాస్తవమని టిడిపి రూరల్ అధ్యక్షులు హెచ్ ఎన్ రాము పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం వైసీపీ కార్యాలయంలో టిడిపికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరినట్లు ప్రచారం చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. పార్టీలో చేరినట్లు వెల్లడించిన వారందరూ ఎండియు వాహనాలలో వైసిపి పనిచేసిన వారే అని పేర్కొన్నారు. ఇలాంటి అవాస్తవ ప్రచారాలు చేయకూడదని వైసిపి వారికి సూచించారు.